సాక్షి అనంతపురం

మంగళవారం । 4 । జూలై । 2023



మరింత తగ్గిన చీనీ ధర

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి.



ఇప్పుడు గుర్తొచ్చారా సునీతమ్మా?

అధికారంలో ఉన్నపుడు గుర్తురాని దళితులు ఇప్పుడు గుర్తొచ్చారా సునీతమ్మా అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. IIలో

గరిష్టం/కనిష్టం

38.3°/23.1°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

భారత మహిళా క్రికెట్ జట్టుకు బండ్లపల్లి అమ్మాయి ఎంపిక

- అనూషకు దక్కిన అరుదైన గుర్తింపు



అనూషను అభినందిస్తున్న మాంఛూ ఫెర్రర్

అనంతపురం: నార్పల మండలం బండ్లపల్లికి చెందిన బి.అనూష భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైంది. ఈ నెల 9 నుంచి 22 వరకు బంగ్లాదేశ్‌తో జరిగే టోర్నీలో టీమిండియా తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ఇటీవల హాంకాంగ్‌లో జరిగిన ఆసియా కప్‌లో ఎమర్జింగ్ ఇండియా తరఫున ఆడిన అనూష బాగా రాణించి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించింది. ఎడమ చేతి స్పిన్నర్, బ్యాటర్ అయిన అనూష 2014లో అనంతపురం ఆర్డీటీ అకాడమీలో చేరింది. అకాడమీ ప్రోత్సాహంతో జిల్లా, రాష్ట్ర, జోనల్ స్థాయిలో విశేషంగా రాణించి..చివరకు టీమిండియాలో చోటు దక్కించుకుంది. ఈమె తల్లిదండ్రులు బి.లక్ష్మీదేవి, మల్లిరెడ్డి. సాధారణ రైతు కుటుంబం అయినప్పటికీ కుమార్తెను క్రికెటులో బాగా ప్రోత్సహించారు. ఆర్డీటీ సహాయ సహకారాలతోనే తాను ఈ స్థాయికి వచ్చానని అనూష తెలిపింది. టీమిండియా తరఫున బాగా రాణించి దేశానికి పేరు తెస్తానంది. అనూష క్రీడాప్రస్థానం ఇతర క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడా ఆణిముత్యాలను వెలికితీయడమే లక్ష్యంగా ఆర్డీటీ పనిచేస్తోందని చెప్పారు.

డ్రైల్యాండ్ హార్టికల్చర్ మొక్కల ధరల ఖరారు



అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకంలో భాగంగా మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద మొక్కల ధరలు ఖరారు చేస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నర్సరీల నుంచి కావాల్సిన మొక్కలను కొనుగోలు చేస్తే రైతుల ఖాతాల్లోనే మొక్కల నిధులను జమ చేయనున్నట్లు వెల్లడించారు. మొక్కలు కొనుగోలు చేసే స్తోమత లేని రైతులకు ప్రభుత్వమే నేరుగా నర్సరీల నుంచి మొక్కలను కొని పంపిణీ చేస్తుందన్నారు. అందులో భాగంగానే పండ్ల మొక్కల ధరలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మామిడి మొక్క ధర రూ.45, జీడిమామిడి రూ.40, సీతాఫలం రూ.40, సపోట రూ.40, తైవాన్ జామ రూ.30, కొబ్బరి మొక్క రూ.60, చింత రూ.55, బత్తాయి రూ.55, అంజూర రూ.30, అల్లనేరేడు మొక్క రూ.50గా నిర్ణయించినట్లు వివరించారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 6వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టనున్నారు. ఇప్పటికే 4,500 ఎకరాల్లో పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



అనంతపురం మూడో రోడ్డులో షిర్డీసాయినాథున్ని దర్శించుకుంటున్న భక్తులు

గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. జిల్లా అంతటా షిర్డీసాయి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతపురం, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, గుత్తి, కూడేరు, యాడికి, తదితర ప్రాంతాల్లో వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. పలు చోట్ల సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు ఆచరించారు. భక్తులు షిర్డీసాయినాథుడిని, దత్తాత్రేయుడిని దర్శించుకున్నారు. ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ చేశారు.

– సాక్షి బృందం



తాడిపత్రిలో అలంకరణలో శ్రీదత్తాత్రేయుడు



అనంతపురం వేమన భవన్ వద్ద సాయిబాబాకు పూజలు



ఆత్మకూరులో సాయి బాబా విగ్రహానికి అభిషేకాలు నిర్వహిస్తున్న మహిళలు

దొంగ ఓట్ల పాపం టీడీపీదే

రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నేతలు అధికారంలో ఉన్నప్పుడు చేసిన 'దొంగ ఓట్ల' పాపం ఇప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో వారిమెడకే చుట్టుకుంటోంది. జిల్లా వ్యాప్తంగా దొంగ ఓట్లను తొలగిస్తుండటంతో ఇప్పుడు తేలు కుట్టిన దొంగల్లా టీడీపీ నాయకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ తప్పులు కప్పిపుచ్చుకునేందుకు అధికార వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆరోపణలు చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ తీరును చూసి ప్రజలు చీదరించుకుంటున్నారు.

- 2017–18లో జాబితాలోకి దొంగ ఓట్లు
- కదిరి, ధర్మవరం, రాయదుర్గంలో భారీగా చేరికలు
- ఒక్కొక్కరికి ఒకే నియోజకవర్గంలో రెండు చోట్ల ఓటు
- డూప్లికేట్ ఓట్ల తొలగింపుపై తెలుగు తమ్ముళ్ల గగ్గోలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షన్నర ఓట్లకు పైగా దొంగ ఓట్లు ఎక్కించినట్టు తెలుస్తోంది. టీడీపీ హయాంలో 2017–18లో ప్రతి నియోజకవర్గంలోనూ ఊరూ పేరూ లేని వాళ్లందరి ఓట్లు ఆ పార్టీ నాయకులు ఎక్కించారు. ఐదు కిలోమీటర్ల పరిధిలోనే రెండు గ్రామాల్లోనూ ఓట్లు ఉన్న వారూ ఉన్నారు. ఇలాంటి డూప్లికేట్ ఓటర్లను లెక్కిస్తే ఒక్క రాయదుర్గంలోనే 30 వేల ఓట్లు బయటపడినట్టు తాజాగా తేలింది. దీన్నిబట్టి ప్రతి నియోజకవర్గంలో 15 వేల నుంచి 20 వేల ఓట్లు ఎక్కించి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని టీడీపీ నాయకులు ప్రయత్నించారు. కానీ జగన్ ప్రభంజనంతో 2019లో టీడీపీ కొట్టుకుపోవడంతో.. ఇప్పుడు తిరిగి డూప్లికేట్ ఓట్లను కాపాడుకోవడానికి అధికార పార్టీ శాసనసభ్యులపై ఆరోపణలు చేస్తున్నట్టు విమర్శలొస్తున్నాయి.

బయటపడుతున్న డూప్లికేట్లు

ఇటు అనంతపురం.. అటు శ్రీసత్యసాయి జిల్లాల్లో 2017–18లో నమోదైన ఓట్లను నిశితంగా పరిశీలిస్తే ఒక్కో పంచాయతీలో వెయ్యి ఓట్లకు పైగా దొంగ ఓట్లు బయటపడ్డాయి. వీటన్నిటినీ తొలగించాలని ఎన్నికల అధికారులు ఆదేశించారు. ఒకే నియోజకవర్గంలో ఇలా పలు చోట్ల ఓట్లు ఎలా వచ్చాయని ఎన్నికల అధికారులే ఆశ్చర్యపోతున్నారు. వీటిని తొలగిస్తుండగా తెలుగుదేశం పార్టీ నాయకులు గొడవ చేస్తున్నారు. తమ అనుకూల మీడియాతో ఇష్టారాజ్యంగా వార్తలు రాయిస్తున్నారు. ఉదాహరణకు ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం పట్టణం, తాడిమర్రి మండలంలోనూ రెండు చోట్లా ఓట్లు ఉన్న వాళ్లు బోలెడంతమంది బయటపడ్డారు. అలాగే ధర్మవరం పట్టణంలోనూ ముదిగుబ్బలోనూ రెండు చోట్ల ఓట్లు ఉన్నవారున్నారు. ఇక కదిరి పట్టణంలో ఒకే ఓటరు రెండు లేదా మూడు చోట్ల కూడా నమోదై ఉన్నారు.

దొంగ ఓట్లలో కాల్వ కీలక పాత్ర



మంత్రిగా మూడేళ్లపాటు అధికారాన్ని చెలాయించిన మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. ఒక్క రాయదుర్గం నియోజకవర్గంలోనే 20 వేల నుంచి 25వేల దొంగ ఓట్లు ఎక్కించారు. దొంగ ఓట్లతో గెలవాలనుకున్నాడు. కానీ జనం గట్టి దెబ్బ కొట్టారు. ఇదే జనం మళ్లీ 2024లో కొట్టబోతున్నారు. ఇప్పటికైనా ఇలాంటి పనులు మానుకోవాలని కాల్వకు సూచిస్తున్నా.

–కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్, రాయదుర్గం

ఆధారాలతో కోర్టులో వ్యాజ్యం



2017–18 సమయంలో దొంగ ఓట్లను ఎక్కించిన ఆధారాలు నా దగ్గర పక్కాగా ఉన్నాయి. వీటిపై హైకోర్టు, సుప్రీం కోర్టులో వ్యాజ్యం వేశాను. ఇప్పుడా దొంగ ఓట్లను తొలగించాలని చూస్తుంటే మేము దొంగ ఓట్లు ఎక్కిస్తున్నట్టు టీడీపీ నాయకులు మాట్లాడ్డం సిగ్గుచేటు. మేము తప్పు చేసి ఉంటే కోర్టుకెందుకు వెళతాం. నిజంగా నేను కోర్టుకెళ్లడం తప్పు అని అనుకుంటే ఎవరైనా కౌంటర్ వేయచ్చు కదా.

–కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే, ధర్మవరం

108 అంబులెన్సు వ్యవస్థకు దన్ను

- ఉమ్మడి జిల్లాకు కొత్తగా 12 వాహనాలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పురుడు పోసుకున్న 108 అంబులెన్సు వ్యవస్థకు జగనన్న సర్కారు మరింత దన్నుగా నిలిచింది. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 146 కొత్త అంబులెన్సులను ప్రారంభించగా.. అందులో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు కలిపి 12 అంబులెన్సులు కేటాయించారు. దీంతో ఎమర్జెన్సీ సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

నాడు నిర్వీర్యం.. నేడు పునరుజ్జీవం

2019కు ముందు అంటే తెలుగుదేశం పార్టీ హయాంలో 108 అంబులెన్స్ వ్యవస్థ దారుణంగా ఉండేది. డీజిల్, కొత్త టైర్ల మార్పిడితో పాటు సిబ్బందికి వేతనాలకు తగినంత బడ్జెట్ ఉండేది కాదు. దీంతో వాహనాల సేవలు అంతంతమాత్రంగానే ఉండేవి. అప్పట్లో ఉమ్మడి జిల్లాకు 33 మాత్రమే ఉండేవి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఈ సంఖ్య 66కు పెంచి పునరుజ్జీవం పోసింది. ప్రస్తుతం ఉన్న 66 వాహనాల్లో తరచూ మరమ్మతులకు వస్తున్నవి లేదా టైర్లు అరిగిపోయి ఉన్న వాటి స్థానంలో ఈ 12 వాహనాలను ఏర్పాటు చేస్తారు. అత్యాధునిక వైద్య పరికాలు, ఆక్సిజన్, మల్టీపారా మానిటర్, వెంటిలేటర్, సిరంజి పంప్, ఇన్ఫ్యూజన్ పంప్, సక్షన్ ఆపరేటర్, అంబుబ్యాగ్స్, ఎమర్జెన్సీ మెడిసిన్స్ వంటి వైద్యపరికరాలతో రోజూ ఆపదలో ఉన్న వేలాది మందిని ఆదుకుంటున్నాయి. 165 మంది డ్రైవర్లు, 165 మంది మెడికల్ టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. 108 వాహనాల ద్వారా సగటున 1.10 లక్షల మంది సేవలు పొందుతున్నారు.

తెలుగు తమ్ముళ్ల డిష్యుం డిష్యుం

- గుత్తిలో టీడీపీ బస్సుయాత్రలో పొడచూపిన విభేదాలు

గుత్తి: పట్టణంలో సోమవారం టీడీపీ చేపట్టిన బస్సు యాత్రలో వర్గ విబేధాలు బహిర్గతమయ్యాయి. గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే ఆర్. జితేందర్ గౌడ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్ వర్గాలు ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. టీడీపీ చేపట్టిన బస్సు యాత్ర సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేందర్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్ వర్గీయులు వేర్వేరుగా గాంధీ సర్కిల్ వద్ద గుమిగూడారు. బస్సు గాంధీ సర్కిల్ వద్ద ఆపాలని వెంకట శివుడు యాదవ్ వర్గీయులు అడ్డుపడ్డారు. ఈ క్రమంలోనే జితేందర్ గౌడ్ వర్గీయులు అక్కడ ఆపకూడదంటూ భీష్మించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సమక్షంలోనే ఇరు వర్గాలకు చెందిన కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. సీనియర్ నాయకులు సర్దిజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.



ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్న టీడీపీ కార్యకర్తలు

ఏర్పాట్లలో పొరపాట్లకు తావీయొద్దు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో పొరపాట్లకు తావీయొద్దని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల ఎనిమిదో తేదీన సీఎం వైఎస్ జగన్ కళ్యాణదుర్గం వేదికగా పంటల బీమా, ఫసల్‌బీమా నిధుల విడుదల చేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఏర్పాట్లలో భాగంగా హెలిప్యాడ్, బహిరంగ సభా స్థలం, పార్కింగ్ తదితర ప్రదేశాలను కలెక్టర్ గౌతమి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, జేసీ కేతన్‌గార్గ్, ఆర్డీఓలు నిశాంత్‌రెడ్డి, మధుసూదన్‌తో పాటు ఆయా శాఖల అధికారులు సోమవారం పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద వీవీఐపీ, వీఐపీలు సీఎంను కలుసుకునే విధంగా బారికేడ్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మోడల్ స్కూల్ ఎదురుగా నిర్వహించనున్న బహిరంగ సభ ప్రదేశం వద్ద విద్యుత్, నీటి సౌకర్యం, ప్రజలకు అవసరమైన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్ స్థలాలను సిద్ధం చేసి ఉంచాలని సూచించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, ఏర్పాట్లలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రొటోకాల్ విషయంలో రాష్ట్ర అధికారుల సూచనల మేరకు వ్యవహరించాలని చెప్పారు. సమష్టి కృషితో సీఎం పర్యటనను జయప్రదం చేద్దామని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో, రెవెన్యూ, పోలీసు, ఫైర్, ఫారెస్ట్, హెల్త్, మున్సిపల్, ఉపాధి, డీఆర్‌డీఏ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సౌమ్యుడు, సమర్థుడు

- పోలీసు శాఖలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీఐ ఆనందరావు
- ఆయన ఆత్మహత్యపై పోలీసు వర్గాల దిగ్భ్రాంతి
- మంచి అధికారిని కోల్పోయాం
- సంతాపం తెలిపిన ఎంపీ, ఎమ్మెల్యే, పోలీసు అధికారులు



సీఐ ఆనందరావు (ఫైల్)



కుమారుడి మృతదేహం వద్దకు తండ్రి తిరువెంగళరావును తీసకొస్తున్న సీఐ చిన్న పెద్దయ్య



సీఐ ఆనందరావు మృతదేహానికి పోలీసుల గౌరవ వందనం.. చిత్రంలో ఎంపీ మాధవ్

తాడిపత్రి/చంద్రగిరి : తాడిపత్రి పట్టణ సీఐ ఆనందరావు (51) కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకోవడం పోలీసు వర్గాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన సోమవారం తెల్లవారుజామున తాడిపత్రి పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకున్నారు. పోలీసు శాఖలో మంచి అధికారిగా పేరున్న ఆయన ఇలా తనువు చాలించడాన్ని పోలీసులు, ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన పనిచేసిన ప్రతిచోట సమర్థుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సౌమ్యుడిగాను, సేవభావం కల్గిన అధికారిగానూ పేరొందారు.

1998 బ్యాచ్ అధికారి

ఆనందరావు స్వగ్రామం తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కల్‌రోడ్‌పల్లి. భార్య అనురాధ, కుమార్తెలు కావ్య (బీటెక్), భవ్య (ఇంటర్) ఉన్నారు. ఆయన 1998 సంవత్సరంలో పోలీసు శాఖలో ఎస్ఐగా విధుల్లో చేరారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌కు ఈయన ఎస్ఐగా బ్యాచ్‌మేట్. ఎస్ఐగా, ఆ తర్వాత పదోన్నతిపై సీఐగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పనిచేశారు. ప్రతిచోట మంచి పేరు తెచ్చుకున్నారు. పోలీసు విధులతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ శభాష్ అనిపించుకున్నారు. తాడిపత్రి పట్టణ సీఐగా గత ఏడాది సెప్టెంబరులో బాధ్యతలు చేపట్టారు. కుల మతాలకు అతీతంగా, రాజకీయ సిఫారసులకు దూరంగా ప్రజలకు సేవలందించి మన్ననలు పొందారు. తాడిపత్రి పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదైన పలు కేసులకు సంబంధించి లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో పరిష్కారం చూపినందుకు గాను కొన్ని నెలల క్రితం జిల్లా ఎస్పీ చేతుల మీదుగా రివార్డు అందుకున్నారు. అంతకు ముందు కరోనా విపత్తు సమయంలో రైల్వే కోడూరులో విధులు నిర్వర్తించినప్పుడు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. యాచకులకు, కూలీలకు అండగా నిలిచారు. విద్యార్థులకు తనవంతు సహాయ సహకారాలు అందించారు.

కల్‌రోడ్డుపల్లిలో విషాదం

సీఐ ఆనందరావు ఆత్మహత్యతో ఆయన స్వగ్రామం కల్‌రోడ్‌పల్లిలో విషాదఛాయలు నెలకొన్నాయి. సోమవారం సాయంత్రం ఆనందరావు భౌతికకాయం కల్‌రోడ్‌పల్లికి చేరుకుంది. ఆయనతో అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ బంధువులు, గ్రామస్తులు బోరున విలపించారు. వారం క్రితమే గ్రామానికి వచ్చి వెళ్లాడని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి అండగా ఉంటూ, కష్టాలలో ఉన్న వారికి ఆర్థిక సాయం చేసేవారని వారు వెల్లడించారు. ఆయన లేరన్న విషయాన్ని నమ్మలేకపోతున్నామని చిన్నాన్న గంగాధరం కన్నీటి పర్యంతమయ్యారు. గతంలో కళ్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్, తిరుమలలో ఏవీఎస్‌వోగా పనిచేశారని గుర్తు చేశారు. ఆనందరావు మృతి పట్ల చంద్రగిరి పీటీసీలో నివాళులర్పించారు.

పలువురి నివాళి

సీఐ ఆనందరావు మృతదేహానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో పాటు అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, డీఎస్పీ గంగయ్య, సీఐలు చిన్న పెద్దయ్య, శంకర్‌రెడ్డి, ఎస్ఐలు ధరణీబాబు, మహమ్మద్ గౌస్, గురుప్రసాద్, ఖాజా హుస్సేన్, శ్రీనివాసులు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి రమేష్‌రెడ్డి నివాళులర్పించారు.

సీఐ మృతి బాధాకరం : ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



పట్టణ సీఐ ఆనందరావు మృతి బాధాకరమని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విచారం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి తెల్లవారుజామున 4.30 గంటలకే సీఐ నివాసానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి వద్ద ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ సీఐ ఆనందరావు విధుల్లో నిక్కచ్చిగా వ్యవహరించేవారన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడేవారు కాదన్నారు. సౌమ్యుడు, మృదుస్వభావి అయిన సీఐ ఆనందరావు ఆత్మహత్యను కూడా మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి రాజకీయం చేయడం తగదన్నారు. శవరాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. తన తల్లిదండ్రుల మధ్య మనస్పర్థలు ఉండేవని సీఐ ఆనందరావు కుమార్తె తనతో స్వయంగా చెప్పిందని ఎమ్మెల్యే వివరించారు.

క్రమశిక్షణ కలిగిన వ్యక్తి ఆనందరావు : ఎంపీ మాధవ్

సీఐ ఆనందరావు ఎంతో క్రమశిక్షణ కల్గిన వ్యక్తి అని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. ఆయన తాడిపత్రి ప్రభుత్వాసుపత్రి వద్ద సీఐ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఇద్దరం ఒకే బ్యాచ్‌లో శిక్షణ తీసుకున్నామన్నారు. క్రమశిక్షణ, కష్టపడే తత్వం ఉన్న సీఐ ఆనందరావు మృతి బాధాకరమన్నారు.

తాడిపత్రి ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్న సీఐ ఆనందరావు ఎంతో క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని డీఎస్పీ గంగయ్య కొనియాడారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత

అనంతపురం అర్బన్: ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్పందన', 'జగనన్నకు చెబుదాం'లో ప్రజల నుంచి అందే అర్జీలకు అధిక ప్రాధాన్యత నిస్తూ పరిష్కరించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ గాయత్రీదేవి, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు కేశవనాయుడు, శ్రీనివాసులు 627 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పరిష్కరించే క్రమంలో ఏస్థాయిలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఆదేశించారు.. అర్జీలు రీ–ఓపెన్ అయ్యాయంటే సమస్యకు సరైన పరిష్కారం చూపలేదని స్పష్టమవుతుందన్నారు. సదరు అధికారులపై చర్యలు ఉంటాయని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. అదే క్రమంలో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలి

ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు చేర్చే ఓ బృహత్తర కార్యక్రమం 'జగనన్న సురక్ష' అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం ముగిసిన తరువాత ఏ ఒక్కరూ మాకు ఫలానా సంక్షేమం అందలే దనే ఫిర్యాదు రాకూడదన్నారు. కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.



అర్జీలు స్వీకరిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమి

అర్జీల్లో కొన్ని...

- గాలివానకు 15 ఎకరాల్లో దెబ్బతిన్న అరటి పంటకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన దరూరు వేణుగోపాల్ విన్నవించాడు.
- మాజీ సైనికుల కోటా కింద రావాల్సిన ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని మంజూరు చేయాలని పామిడి మండలం రామరాజుపల్లికి చెందిన మాజీ సైనికుడు లక్ష్మిరెడ్డి విన్నవించాడు.

క్లుప్తంగా

తపాలా ఉద్యోగుల ధర్నా



తపాలా శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట బైఠాయించిన ఉద్యోగులు, సిబ్బంది

అనంతపురం సిటీ: స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని తపాలా శాఖ డివిజనల్ ప్రధాన కార్యాలయం ఎదుట ఆ శాఖ ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వర్, డివిజన్ కార్యదర్శి శంకరయ్య, కృష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ ఎన్ఎఫ్‌పీఈ పోస్ట్‌మెన్స్, ఎంటీఎస్ యూనియన్ కేంద్ర నాయకత్వం పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎన్ఎఫ్‌పీఈ గుర్తింపు రద్దు ఉపసంహరించుకోవాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకూ దశల వారీగా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా



బంగారు పతకాలతో క్రీడాకారులు

అనంతపురం: తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్, చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంయుక్తంగా తిరుపతి పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు విద్యా మందిర్‌లో జులై 1,2, తేదీలలో పోటీలు నిర్వహించాయి. ఇందులో పాల్గొన్న జిల్లాకు చెందిన ఆర్.మురళి, ఎం.నిఖిత్ కుమార్, వి.వి. వెన్నెల, ఎస్.కరిష్మా, పి.పూజిత ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఈనెల 7,8,9 తేదీల్లో కర్ణాటక రాష్ట్రం శిమొగ్గ పట్టణంలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో వీరు రాష్ట్రం తరపున ప్రాతినిథ్యం వహిస్తారు. క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, అనంతపురం జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురుస్వామి సోమవారం అభినందించారు.

దళితులు ఇప్పుడు గుర్తొచ్చారా సునీతమ్మా?

- ఓట్ల కోసం దళితుల నడుమ చిచ్చు పెట్టొద్దు
- కులాలతో నీచ రాజకీయాలు చేయడం మానుకోండి
- మాజీ మంత్రిపై వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు లింగాల రమేష్, ఎస్సీ సెల్ నాయకులు

అనంతపురం క్రైం: మాజీ మంత్రి పరిటాల సునీత దళితుల నడుమ చిచ్చు పెడుతున్నారని వైఎస్సార్ సీపీ దళిత నాయకులు ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్ వద్ద మాజీ మంత్రి పరిటాల సునీత చేపట్టిన ధర్నా, 'స్పందన'లో ఇచ్చిన ఫిర్యాదును వ్యతిరేకిస్తూ సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ నాయకులు లింగాల రమేష్ మాట్లాడుతూ ఆత్మకూరు మండలం బీ యాలేరు గ్రామంలో 6.60 ఎకరాల భూమిని దళితులకిచ్చినట్లు, దళితులకు న్యాయం చేయాలంటూ మాజీ మంత్రి స్పందనలో ఫిర్యాదు చేయడం హాస్యాస్పదమన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో దళితుల ఓట్లు కొల్లగొట్టేందుకు కుయుక్తులు పన్నుతున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కనిపించని దళితులు ఇప్పుడెందుకు సునీతమ్మకు గుర్తుకొచ్చారో అర్థం కావడం లేదన్నారు. రామగిరి సింగిల్ విండో ప్రెసిడెంట్ ముత్యాలు మాట్లాడుతూ 1994లో పరిటాల రవి ఆర్‌టీసీ దళం పేరుతో ఎస్సీ, బీసీ, రెడ్డి కులాలకు చెందిన వారిని ఊచకోత కోసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పరిటాల సునీత గ్రామాల్లో కులాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకున్నారన్నారు. పార్టీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు కుంటిమిద్దె ఓబులేసు మాట్లాడుతూ గతంలో పరిటాల కుటుంబం నక్సలైటు ఉద్యమాల పేరుతో దళితులను వాడుకున్న విషయాన్ని గుర్తు చేశారు. నసనకోటకు చెందిన ముత్యాలప్పను వాడుకోవడంతో పాటు నక్సలైటు ఉద్యమాల్లో ఎంతో మంది బలైతే వారికి ఎటువంటి న్యాయం చేశారో? చెప్పాలని సునీతమ్మను నిలదీశారు. కిరణ్‌కుమార్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో దళితులకు భూమి పంపిణీ చేయాలని తాము ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న పరిటాల సునీత అడ్డు తగిలింది వాస్తవం కాదా అన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నాయకత్వంలో ప్రశాంత వాతావరణం నెలకొందని, మాజీ మంత్రి పరిటాల సునీత దళితులకు అన్యాయం జరిగిందంటూ అలజడులు సృష్టించేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. మంత్రిగా ఉన్నప్పుడు కనీసం 250 కుటుంబాలకు కూడా ఇళ్లు కట్టించలేదని వైఎస్సార్ సీపీ నాయకులు మహేష్ విమర్శించారు. తన సొంత నియోజకవర్గంలోని దళిత నాయకులకే న్యాయం చేయలేని ఎంఎస్ రాజు పీ.యాలేరు దళితులకు ఏం చేస్తారని ప్రశ్నించారు. ఎస్సీ సెల్ నాయకురాలు పెద్దక్క మాట్లాడుతూ తమ భూమిలో పనులు చేసేందుకు వెళితే కూడా టీడీపీ హయాంలో పరిటాల కుటుంబీకులు చిత్రహింసలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు దళితులపై ప్రేమ ఒలకబోయడం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రజలకు అండగా తోపుదుర్తి సోదరులు

తలుపూరు సర్పంచ్ ఓబులేసు, ఆత్మకూరు వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, సింగంపల్లి తాండ సర్పంచ్ ఆర్ వెంకటేశ్ నాయక్, కనగానపల్లి ఎస్సీ సెల్ నాయకులు సూరి మాట్లాడుతూ అధికారంలో లేనప్పుడు కూడా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేద ప్రజలకు బోర్లు వేయించి, మేకలు, గొర్రెల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఎస్సీలు ఎవరైనా మరణిస్తే ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఆయన సోదరుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డిలు రూ.లక్ష, రూ.2 లక్షలు ఇచ్చి ఆదుకుంటున్నారన్నారు. దాదాపు 200 మంది కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారన్నారు. తోపుదుర్తి సోదరులు అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచారన్నారు. దళితుల అభ్యున్నతిపై వారు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. బీ యాలేరులో నిరుపేదలైన 114 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పట్టాలిచ్చారన్నారు. అభివృద్ధిని ఓర్వలేక దళితులను రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలని పరిటాల సునీత కుట్ర చేస్తున్నారన్నారు. రాప్తాడులో 17 వేల ఇళ్లు మంజూరయ్యాయని, మరో 25 వేల ఇళ్లకు పేదలు దరఖాస్తు చేసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా సునీత ఆత్మవిమర్శ చేసుకోకుంటే, మళ్లీ దళితులు తప్పక బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు బండారు అనిల్‌కుమార్, ఎర్రిస్వామి, కృష్ణా నాయక్, మైలర్ నాయక్, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

'అప్పిరెడ్డి'కి నాటా సాహితీ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అప్పిరెడ్డి హరినాథరెడ్డి

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన కవి డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి నాటా (నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్) నుంచి విశిష్ట సాహితీ పురస్కారం అందుకున్నారు. అమెరికాలోని డల్లాస్ నగరంలో జరుగుతున్న మహాసభల్లో నాటా అధ్యక్షుడు కొర్సపాటి శ్రీధర్‌రెడ్డి, వ్యవస్థాపకులు డాక్టర్ ప్రేమ్‌రెడ్డి, డాక్టర్ ఆదిశేషారెడ్డి, గోసాల రాఘవ రెడ్డి తదితరులు సోమవారం ఆయనకు పురస్కారం అందించారు. హరినాథరెడ్డి సాహితీ సేవలను కొనియాడారు. హరినాథరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో జరుగుతున్న ప్రజా ఉద్యమాలకు, సాంస్కృతిక వికాసానికి నాటా మద్దతివ్వాలని కోరారు. రాయలసీమవాసులు మేల్కోకపోతే భావితరాలు నష్టపోతాయని పేర్కొన్నారు. అనంత జిరసం ప్రతినిధులు, సాహిత్య భారతి నిర్వాహకులు అప్పిరెడ్డిని అభినందించారు.

డివైడర్‌ను ఢీకొన్న బైకు.. వ్యక్తి మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: డివైడర్‌ను బైకు ఢీకొనడంతో తీవ్రగాయాలై వ్యక్తి మృతి చెందాడు. స్థానిక తపోవనం సమీపంలోని రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ పరిధిలోని తాటిచెర్లకు చెందిన జగదీశ్వరరెడ్డి (24) బెండకాయల వ్యాపాయం చేసేవాడు. ఆదివారం రాత్రి వ్యాపారం నిమిత్తం నగరానికి వచ్చి తిరిగి ఇంటికి బయలుదేరాడు. తపోవనం సమీపంలోని రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. జగదీశ్వరరెడ్డి తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న అతన్ని స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదంపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అర్హత కలిగిన ప్రతి రైతుకూ డ్రిప్

- ఏపీఎంఐపీ ఓఎస్‌డీ వైవీఎస్ ప్రసాద్



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ ఓఎస్‌డీ వైవీఎస్ ప్రసాద్

అనంతపురం అగ్రికల్చర్: అర్హత కలిగిన ప్రతి రైతుకూ రాయితీతో డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు లక్ష్యమని ఏపీఎంఐపీ ఆఫీసర్ ఆన్ స్పెషల్‌డ్యూటీ (ఓఎస్‌డీ) వైవీఎస్ ప్రసాద్ తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు కేటాయించిన 12,500 హెక్టార్ల డ్రిప్, స్ప్రింక్లర్ల (బిందు, తుంపర) లక్ష్యాన్ని డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సోమవారం పీడీ జి.ఫిరోజ్‌ఖాన్, ఉద్యాన అధికారి బి.రఘునాథరెడ్డితో కలిసి స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్లు, ఎంఐఏఓలు, డ్రిప్ కంపెనీ ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎక్కడా అలసత్వం వహించకుండా పనిచేయాలన్నారు. గతేడాది 11 వేల హెక్టార్ల లక్ష్యానికి గానూ 13,697 హెక్టార్లకు ఇచ్చి రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఈ సారి కూడా డిసెంబర్ లోపు పూర్తి చేస్తే, అదనపు కేటాయింపులు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతేడాది పెండింగ్ ఉన్న 2,267 హెక్టార్లకు ఈ నెలాఖరులోపు మెటీరియల్ సరఫరా, ఇన్‌స్టలేషన్ పూర్తి చేయాలన్నారు. సేల్స్ ఆఫ్టర్ సర్వీసు, ట్రయల్ రన్, ఫర్టిగేషన్, యాసిడ్ ట్రీట్‌మెంట్ లాంటి డ్రిప్ నిర్వహణ రైతుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. డ్రిప్ ద్వారా నాణ్యమైన ఫలసాయం వచ్చేలా రైతుల వెన్నంటి ఉండాలని సూచించారు.

ఉద్యోగాల పేరుతో కుచ్చుటోపీ

- ఎస్పీని ఆశ్రయించిన బాధితులు
- 'స్పందన'లో 129 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఉద్యోగాల పేరుతో 'సుచిత్ర ఏజెన్సీ' యువకులకు కుచ్చుటోపీ పెట్టింది. ఏజెన్సీ నిర్వాహకురాలు కరణం సవితపై 10 మంది యువకులు 'స్పందన'లో ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని కోరుతూ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన 'గ్రీవెన్స్'లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో మండల కో ఆర్డినేటర్లుగా ఉద్యోగాలిప్పిస్తామని లక్షలాది రూపాయలు వసూలు చేసిందన్నారు. ఇదేమని అడిగితే మీ ఇష్టం వచ్చిన చోట చెప్పుకోండని దౌర్జన్యం చేస్తోందని వాపోయారు. తనకు ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, న్యాయవాదులు తెలుసంటూ బెదిరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య విన్న ఎస్పీ సంబంధిత స్టేషన్లకు ఫిర్యాదులను పంపారు. 'స్పందన'లో 129 ఫిర్యాదులు అందగా, జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆయా పోలీసు అధికారులతో ఎస్పీ మాట్లాడారు. త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్ విజయ భాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, ఎస్బీ సీఐ ఇందిర, టెక్నికల్ ఎస్ఐ సుధాకర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

136 మందికి అక్రిడిటేషన్

- రెండో విడత జాబితా ప్రకటించిన కలెక్టర్

అనంతపురం అర్బన్: రెండో విడతలో 136 మందికి అక్రిడిటేషన్ మంజూరు చేసినట్లు కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఎం.గౌతమి ప్రకటించారు. ఇందుకు సంబంధించి వివరాలను సోమవారం ఆమె వెల్లడించారు. ఇప్పటి వరకూ 366 మంది మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ మంజూరు చేశామన్నారు. రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిబంధనల మేరకు డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో సమర్పిస్తే మంజూరు చేస్తామని చెప్పారు. త్వరలో మూడో విడత సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఫెయిల్ అయిన విద్యార్థులూ బడికి

- జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్



ఫెయిల్ అయిన పదో తరగతి విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ అయిన పదో తరగతి, ఇంటర్ విద్యార్థులూ బడులు, జూనియర్ కళాశాలలకు వెళ్లేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఆదేశించారు. 18 ఏళ్లలోపు పిల్లలందరూ తప్పనిసరిగా చదువుకునేలా రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో భాగంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం సోమవారం అనంతపురం నగరంలోని ఎస్కేడీ పాఠశాలలో జరిగింది. డీఈఓ సాయిరామ్ పాల్గొని ఫెయిల్ అయిన పదో తరగతి విద్యార్థులను బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెయిల్ అయిన విద్యార్థులు ఏడాది పాటు వృథా చేసుకోకుండా పాఠశాలలు, కళాశాలలకు పంపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోను వందశాతం సాధించేందుకు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. చదివిన పాఠశాలలు, కళాశాలల్లో పునఃప్రవేశాలు కల్పిస్తారన్నారు. ప్రధానోపాధ్యాయులు తలిదండ్రులను సంప్రదించి పాఠశాలల్లో చేర్పించేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటస్వామి, ఆలెస్కో బాలమురళీ, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి హల్‌చల్



శ్రీమజ్జనపల్లి పొలాల్లో ఎలుగుబంటి

కుందుర్పి: మండలంలోని శ్రీమజ్జనపల్లి–కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో సోమవారం ఓ ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. శ్రీమజ్జనపల్లి, వడ్డెపాళ్యం పరిసర ప్రాంతాల్లో పశువుల కాపర్లు, రైతులపై దాడికి యత్నించింది. రైతులు కట్టెలతో తరుముతూ కేకలు వేయడంతో అనుంపల్లి గుట్టల్లోకి వెళ్లిపోయింది. వారం రోజులుగా ఎలుగుబంట్లు పొలాల్లో సంచరిస్తూ పాదచారులు, రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు పరిసర గ్రామాల ప్రజలు వాపోయారు.

'ఐసీడీఎస్'లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

అనంతపురం సెంట్రల్: ఎస్ఎస్ఎం, పోషణ అభియాన్ ప్రాజెక్టులో కాంట్రాక్టు ప్రాతిపదికన జిల్లా ప్రాజెక్టు కో ఆర్డినేటర్, జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పోస్టుకు కంప్యూటర్ సైన్సు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో డిగ్రీ లేదా డిప్లొమో చేసి ఉండాలన్నారు. అప్లికేషన్ మెయింటెనెన్స్, సపోర్టులో రెండు సంవత్సరాలు పనిచేసిన అనుభవం, తెలుగు చదవడం, రాయడం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుకు సోషల్ సైన్సు, న్యూట్రీషియన్, డిగ్రీ తత్సమాన పీజీ డిప్లమో కలిగి ఉండాలని పేర్కొన్నారు. టీం సభ్యులకు శిక్షణ, పర్యవేక్షించడంలో రెండు సంవత్సరాల అనుభవం, తెలుగు, ఇంగ్లిషు రాయడం, చదవడం, కంప్యూటర్, ఇంటర్నెట్ వాడకంలో ప్రావీణ్యం ఉండాలన్నారు. జిల్లా అంతటా పర్యవేక్షించేందుకు సంసిద్ధులై ఉండాలన్నారు. జులై 4 నుంచి 12 లోగా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌గా షేక్ ఖాజా మస్తాన్



షేక్ ఖాజా మస్తాన్

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌గా షేక్ ఖాజా మస్తాన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణా జిల్లాలో పని చేస్తున్న ఆయన్ను అనంతపురానికి బదిలీ చేశారు. మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ రఫీని సోమవారం కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అనంతపురం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగిన షేక్ ఇమ్రాన్ నంద్యాల జిల్లా రెగ్యులర్ అధికారిగా కొనసాగనున్నారు. కాగా ఖాజా మస్తాన్.. సోమవారం వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కలిసికట్టుగా కృషి చేద్దామని తెలిపారు.

జేసీ ప్రభాకర్ రెడ్డివి శవరాజకీయాలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా ధ్వజం



అనంతపురం క్రైం: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి శవ రాజకీయాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య ధ్వజమెత్తారు. తాడిపత్రి సీఐ ఆనందరావు కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నారని స్వయంగా ఆయన కూతురు తెలియజేస్తున్నా ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. రాజకీయ ఒత్తిళ్లతో సీఐ ఆత్మహత్య చేసుకున్నారంటూ నీచ రాజకీయం చేయడం బాధాకరమన్నారు. పోలీసులను తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఎంతో గౌరవిస్తారన్నారు. అధికారులను అన్నా అంటూ సంబోధిస్తారని తెలిపారు. తాడిపత్రిలో పోలీసులు స్వేచ్ఛగా పని చేసుకునేందుకు సహకరిస్తున్నారన్నారు. తమ పనులు చేయని పక్షంలో పోలీసులపై దాడులు చేయడం, నోటికొచ్చినట్లు మాట్లాడే చరిత్ర జేసీ సోదరులదన్నారు. గతంలో డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ భాస్కర్ రెడ్డి పట్ల మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి వ్యవహరించిన తీరును గుర్తు చేశారు. సీఐ హమీద్‌ఖాన్‌పై జేసీ అనుచరులు దాడికి తెగబడ్డారని ఆరోపించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి సైతం తరచూ పోలీసులను నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతున్నారన్నారు. ప్రశాతంగా ఉన్న తాడిపత్రిలో అలజడులు సృష్టించేందుకు యత్నించడం బాధాకరమన్నారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, జేసీ కుటుంబానికి మరోసారి బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

వెల్‌కం సార్

- పుట్టపర్తికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్
- స్వాగతం పలికిన కలెక్టర్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ అరుణ్ బాబు

ప్రశాంతి నిలయం: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశాంతి నిలయం చేరుకున్నారు. బెంగళూరు నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో రోడ్డు మార్గాన సోమవారం రాత్రి ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. శాంతిభవన్ అతిథి గృహం వద్ద కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, జిల్లా అధికారులతో పాటు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యులు నాగానంద, డాక్టర్ మోహన్, చక్రవర్తి, హీరా తదితరులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ శాంతిభవన్ అతిథి గృహంలో బస చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్మించిన సాయిహీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించనుండగా, గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.

జీ ప్యాట్‌లో 'ఓటీపీఆర్ఐ' మెరుపులు

అనంతపురం: గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీ–ప్యాట్)లో జేఎన్‌టీయూ అనంతపురం–ఓటీపీఆర్ఐ (ఆయిల్ టెక్నాలజీ, ఫార్మసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)కు చెందిన విద్యార్థులు మెరిశారు. ఓటీపీఆర్ఐలో బీఫార్మసీ పూర్తి చేసిన లింగేశ్వర 378వ ర్యాంకు, కే. ప్రత్యూష 921 ర్యాంకు, జి. శివ రంజని 2,286, కే. జోషిత 2,619, బి. రాజశేఖర్ 2,964, జి. సుకన్య 2,586, ఎస్. బ్లెస్సీ 8,472, యమ్.శిరీష 8,870 ర్యాంకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఓటీపీఆర్ఐలో బీఫార్మసీ పూర్తి చేసిన 8 మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి కళాశాల కీర్తిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశారన్నారు. ఫ్యాకల్టీ కృషి ఫలితంగానే మంచి ర్యాంకులు దక్కుతున్నాయని తెలిపారు.

ఫార్మకాలజీలో స్పెషలైజేషన్ లక్ష్యం

జీ–ప్యాట్‌లో జాతీయ స్థాయిలో 378వ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది.నైపర్–23 పరీక్షలోనూ మంచి ర్యాంకు వచ్చింది. ర్యాంకు సాధనకు ఓటీపీఆర్ఐ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ఫ్యాకల్టీ నన్ను ఎంతో ప్రోత్సహించారు. ఎం ఫార్మసీ ఫార్మకాలజీలో స్పెషలైజేషన్ పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉన్నా.

– జి. లింగేశ్వర

ఆనందంగా ఉంది

ఫార్మసీ రంగంలో విశేష పరిశోధనలు చేయాలనే ఆశయంతో ఉన్నా. ఎంఫార్మసీ పూర్తి చేసి పీహెచ్‌డీ చేస్తా. మంచి ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది.

– కే. ప్రత్యూష, జీప్యాట్ 921 వ ర్యాంకు.

క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఆర్ఎంఓగా డాక్టర్ పద్మజ


డాక్టర్ పద్మజ

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో డిప్యూటీ ఆర్ఎంఓగా ఉన్న డాక్టర్ పద్మజ ఇన్‌చార్జ్ ఆర్ఎంఓగా బాధ్యతలు తీసుకున్నారు. ఆర్ఎంఓగా ఉన్న డాక్టర్ సరస్వతికి ఇటీవల కడప జోనల్ మలేరియా అధికారిగా నియమితులయ్యారు. ఖాళీగా ఉన్న ఆర్ఎంఓ పోస్టులో డాక్టర్ పద్మజ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు.

వృత్తి నైపుణ్యంతో సహకార రంగం బలోపేతం


మాట్లాడుతున్న డీసీవో ఎం.ప్రభాకరరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: వృత్తిలో నైపుణ్యత సాధిస్తే సహకార రంగం మరింత బలోపేతం చేయడానికి అవకాశం ఉందని జిల్లా సహకార అధికారి (డీసీవో) ఎం.ప్రభాకరరెడ్డి తెలిపారు. సహకార వ్యవస్థకు సంబంధించి 2023లో 8వ బ్యాచ్ డీసీఎం, సీఏ కోర్సు ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం స్థానిక రాయలసీమ సహకార శిక్షణ కేంద్రంలో నిర్వహించారు. కంప్యూటర్ శిక్షణతో పాటు సహకార రంగానికి సంబంధించి చరిత్ర, బ్యాంకింగ్, మేనేజ్‌మెంట్, లా, అకౌంట్స్, ఆడిట్ తదితర సబ్జెక్టులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార యూనియన్ ప్రతినిధి ఫణిరాజ్, శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు, డిప్యూటీ రిజిస్ట్రార్, ఫ్యాకల్టీ రాజారెడ్డి, హిందూపురం డీఎల్‌సీవో రామచంద్రయ్య, డీసీసీబీ జీఎం కె.సురేఖారాణి, విశ్రాంత సీఈవో డాక్టర్ వేములేటి నరసింహారెడ్డి, కోర్సులో చేరిన 44 మంది అభ్యర్థులు పాల్గొన్నారు.

పరమహంస యోగానంద నగరోత్సవం


యోగానంద చిత్రపటాన్ని నగరవీధుల్లో ఊరేగిస్తున్న భక్తబృందం

అనంతపురం కల్చరల్: జగద్గురువు యోగానంద పరమహంస జీవితం ఆదర్శప్రాయమని వక్తలు అన్నారు. సోమవారం యోగదా సత్సంగ ధ్యాన కేంద్రంలో పరమహంస యోగానంద గురువులకు నీరాజనాలర్పిస్తూ భక్తులు ధ్యానం, భజనలతో ఆరాధించారు. యోగదా సత్సంగ సొసైటీ వ్యవస్థాపకుడు పరమహంస యోగానంద చిత్రపటాన్ని ఊరేగించారు. స్థానిక ఆదిమూర్తినగర్‌లోని యోగదా సత్సంగ సొసైటీ కార్యాలయంలో ఆధ్యాత్మిక సంఘం ప్రతినిధులు చంద్రశేఖర్, రామకృష్ణ, నరసింహులు, సురేష్ యోగానంద జీవిత విశేషాలను తెలియజేశారు.

5న ప్రైవేట్ పాఠశాలల బంద్

రాప్తాడురూరల్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల దోపిడీని చేస్తున్నాయన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో టెక్నో, ఈ టెక్నో, స్మార్ట్ తదితర బ్రాండ్ల పేరుతో ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. 5న తలపెట్టిన పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి శివతేజ, ఉపాధ్యక్షులు కమలాకర్, భరత్, అఖిలేష్, నరేంద్ర, బాబు, యస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు


విజయసాయిరెడ్డికి పూల బొకే అందజేస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

రాప్తాడురూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు విజయసాయిరెడ్డిని వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఓబుళపతి, గౌరవ అధ్యక్షులు హెచ్. గిరిధర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు వి. రెడ్డిశేఖర్‌రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టీవీ రమణారెడ్డి, రాష్ట్ర కోశాధికారి వి. రాజమోహన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా ప్రసాద్ రెడ్డి, కుమార్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ వయోజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి తదితరులు కలిశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అభిమతం

- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అభిమతమని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 30, 3 సచివాలయాల్లో (నాలుగు సచివాలయాలకు కలిపి) జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత పాల్గొని ప్రసంగించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యుల దయాదాక్షిణ్యాలతో పథకాలు అందేవన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏడాది పాటు నిర్వహించామన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాగా పని చేశారన్నారు. ఇప్పటికే 99 శాతం లబ్ధి చేకూరిందన్నారు. మిగిలిన ఒక్క శాతం లబ్ధిదారులకు పథకాలు వర్తింపజేసేందుకు సీఎం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంపీ, ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, కార్పొరేటర్లు బాలాంజనేయులు, నాగమణి, సుమతి, నాయకులు రవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడు చోట్ల జగనన్న సురక్ష క్యాంపులు..:

నగరంలోని 50.51 సచివాలయాలకు సంబంధించి మంగళవారి కాలనీలోని 50వ సచివాలయం, 32,73 సచివాలయాలకు సంబంధించి బోయవీధిలోని 32 సచివాలయం, 4,5 సచివాల యాలకు సంబంధించి వేణుగోపాల్ నగర్‌లోని 5వ సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపులు జరుగుతాయి.

సులువుగానే సర్టిఫికెట్లు జారీ



నా కొడుకుకు స్కూల్లో అమ్మఒడి కోసం కుల ధ్రువీకరణ పత్రం అడిగారు. గతంలో ఈ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. సర్టిఫికెట్ కోసం చాలా రోజులు పట్టింది. ఇప్పుడు ఎక్కడికక్కడ సచివాలయ సిబ్బందే ఇంటి వద్దకు వచ్చి అన్ని వివరాలు నమోదు చేసుకున్నారు. మూడ్రోజుల్లో కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– చిన్నసుంకమ్మ, విశ్వంభర కళ్యాణ మంటపం వెనుకవైపు వీధి

జగన్ సార్‌కు థ్యాంక్స్

ప్రతి పథకానికీ ఆధార్ అవసరం. అందుకోసం ఎక్కడికెళ్లినా ఆధార్‌కు మొబైల్ నంబర్ లింకు చేసుకోవాలని చెప్తున్నారు. గతంలో ఆధార్ కోసం బ్యాంకు, పోస్టాఫీసులకు వెళ్లి ముగ్గురు పిల్లల కోసం ఒక్కొక్కరికి రూ.100 చెల్లించాం. దరఖాస్తు చేసుకున్నాక మళ్లీ ప్రింట్ కోసం ఒక్కొక్కరికి రూ.50 ఇవ్వాల్సి వచ్చేది. ఆధార్ అప్‌డేట్ చేసేందుకు చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు ప్రభుత్వం సచివాలయాల్లోనే ఆధార్ అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంది. సీఎం జగన్ సార్‌కు థ్యాంక్స్.

– జయమ్మ, సాయినగర్, అనంతపురం



అవినీతి రహిత పాలనే జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: అవినీతి రహిత పాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రుద్రంపేట-3 సచివాలయం దగ్గర ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు రక్ష..

గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ, టీడీపీ నాయకుల దయ ఉంటేనే సంక్షేమ పథకాలు అందేవని ఎమ్మెల్యే విమర్శించారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే పాలన తీసుకొచ్చామన్నారు. వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో పని చేసి, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీలు, మహబూబీ, నారాయణమ్మ, ఓం ప్రకాష్, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాధిక్‌వలి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణవేణి, చంద్రశేఖర్, రామ్మూర్తి, తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

తాటిచెర్ల, కందుకూరులో 'జగనన్న సురక్ష'

రాప్తాడురూరల్: రూరల్ మండలం తాటిచెర్లలో సోమవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం చేపట్టారు. తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఈఓఆర్డీ మాధవి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ భీమిరెడ్డి నాగేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బండి పవన్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ మఠం శ్యాంసుందర్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వడ్డే శీనా తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు సచివాలయం-2 పరిధిలో...

కందుకూరు సచివాలయం-2 పరిధిలో సర్పంచ్ బి.ప్రశాంత్‌కుమార్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, ఎంపీడీఓ వై.పుల్లయ్య, పార్టీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవింద రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పెరవలి జయచంద్రారెడ్డి, డీటీ బాషా, ఎంపీటీసీ రాగే రేవతిపెద్దప్ప, ఉప సర్పంచ్ కేపీ ఓబులేసు, సచివాలయ కన్వీనర్ రాఘవరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, లింగమయ్య, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

వర్షపాతం ఆధారంగానే బీమా పరిహారం ప్రకటన


మాట్లాడుతున్న ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత

ఆత్మకూరు: మండలంలో వర్షపాతం నమోదు ఆధారంగానే బీమా పరిహారం ప్రకటించినట్లు ఏఓ సుచరిత , ఏఈఓ సుజిత తెలిపారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వాతావరణ బీమా వివరాలు వెల్లడించారు. మండలంలో ఫేస్-1, ఫేస్-2, ఫేస్ -3 లలో కురిసిన వర్షపాతాన్ని బట్టి బీమా పరిహారం నిర్ణయించినట్లు తెలిపారు. 16 జూలై 2022 నుంచి 5 ఆగస్టు 2022 వరకు 30 మి.మీ కంటే తక్కువ వర్షం కురిసినట్లయితే వాతావరణ బీమా వస్తుందన్నారు. రాప్తాడు మండలంలో 119 మి. మీ. వర్షపాతం, ఆత్మకూరులో 149 మి.మీ. వర్షపాతం కురిసిందన్నారు. ఫేస్-1లో నష్ట పరిహారం అందలేదన్నారు. ఫేస్ -2 లో గతేడాది ఆగస్ట్ 2 నుంచి 31వ తేదీ వరకు వర్షపాతం 35 మి.మీ. కంటే తక్కువ కురిస్తే నష్టపరిహారం వస్తుందన్నారు. రాప్తాడులో 64 మి.మీ., ఆత్మకూరులో 99 మి.మీ. వర్షపాతం నమోదు కావడంతో పరిహారం అందలేదన్నారు. ఫేస్ -3లో భాగంగా గతేడాది సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు వర్షపాతం 100 మి.మీ. తక్కువ కురిస్తే నష్ట పరిహారం అందుతుందన్నారు. రాప్తాడు మండలంలో 130 మి.మీ., ఆత్మకూరులో 176 మి.మీ.కురిసిందన్నారు. మండలంలో ఇతర పంటలకు నష్టపరిహారం వర్తించలేదన్నారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకు పరిగణలోకి తీసుకున్నప్పుడు ఎక్కడా 20 రోజులకు మించి వర్షభావ పరిస్థితులే లేవన్నారు.

టీడీపీ నేతలకు కడుపుమంట ఎందుకు?

అనంతపురం సిటీ: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తుంటే టీడీపీ నేతలకు ఎందుకు కడుపుమంట అని వైఎస్సార్‌సీపీ అనుబంధం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, కార్పొరేటర్ రహంతుల్లా ప్రశ్నించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీపై చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. మసీదులలో రాజకీయాలు చేస్తున్నారంటూ విమర్శించడాన్ని తప్పుబట్టారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన పార్టీ నేతలు తమ వెంట వస్తే మసీదులలో తాము రాజకీయాలు చేస్తున్నామా లేదా అనే విషయాలు తెలుస్తాయన్నారు. 14 ఏళ్ల కాలంలో చంద్రబాబు ముస్లింమైనార్టీలకు చేసిందేమీలేదన్నారు. నాలుగేళ్ల పాలనలో వైఎస్ జగన్ చేసి చూపించారని అన్నారు. అందుకే జగన్ వెంటే ముస్లింలు ఉన్నారనే విషయాన్ని గుర్తించుకోవాలని కోరారు.

ప్రత్యేక రాయలసీమ కోసం ఉద్యమించాలి

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర విభజన అనంతరం రాయలసీమ తీవ్రంగా నష్టపోయిందని ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పాటుకు ఉద్యమించాల్సిన అవసరం ఉందని రాయలసీమ రాష్ట్ర జాతీయ సమితి అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎన్‌జీవో హోంలో సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం కోసం ఆర్టికల్-3ని ఏర్పాటు చేయాలన్నారు. రాయలసీమ ప్రజల గుండెచప్పుడు ప్రత్యేక రాయలసీమ అని, దీన్ని రాజ్యాంగ బద్ధంగా ఎలా సాధించాలో కార్యాచరణ రూపొందించాలన్నారు. తెలుగు విశ్వవిద్యాలయాలు స్థాపించి వాటికి ప్రత్యేక నిధులను కేటాయించాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో రాయలసీమ యువతీయువకులకు ఎక్కువ భాగం ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేసి రైతు ధాన్యాన్ని నేరుగా రైతులు అమ్ముకునే విధంగా ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రాయలసీమలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, రాయలసీమలోని ప్రతి జిల్లాకు సాఫ్ట్‌వేర్ కారిడార్లు ఏర్పాటు చేయాలన్నారు. రాయలసీమకు రూ.10 లక్షల కోట్ల ప్యాకేజీ, గుంతకల్లు రైల్వే జోన్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఓబులరెడ్డి, సోము సుందర్‌రెడ్డి, నాగార్జున రెడ్డి, రంగారెడ్డి, రామ్‌కుమార్, కళావతమ్మ, మహేష్, భార్గవ్‌రెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

'బండారు శ్రావణిని అడ్డుకోవడం దారుణం'

అనంతపురం టవర్‌క్లాక్: శింగనమల నియోజకవర్గంలో టీడీపీ ఆధ్వర్యంలో చేపట్టిన భవిష్యత్తు గ్యారెంటీ బస్సు యాత్రకు శింగనమల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బండారు శ్రావణిని అడ్డుకోవడం దారుణమని మాదిగ యువత రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున అన్నారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. శింగనమల నియోజకవర్గం సీటు ఎస్సీలకు కేటాయించిందని, అయితే టీడీపీ వర్గీయులు అగ్రకులాల వారి పెత్తనంతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ అయిన బండారు శ్రావణిని బస్సు యాత్రలో పాల్గొనకూడదని రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు చెప్పడం బాధాకరమన్నారు. టీడీపీలో ఎస్సీల అణచివేతకు గురిచేస్తుంటే పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు నారా లోకేష్ స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దళితులను అవమానిస్తే భవిష్యత్తులో టీడీపీకి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ కుటుంబంతోనే ముస్లిం మైనార్టీలు


బ్రోచర్లు విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం సిటీ: వైఎస్సార్ కుటుంబంతో ముస్లిం మైనార్టీలు ఉంటారని నగర మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ అన్నారు. సోమవారం అనంతపురం ఆరో రోడ్డులోని మస్జీదే హజార మసీదులో నమాజు అనంతరం వైఎస్సార్‌సీపీ అనుబంధ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ ఆధ్వర్యంలో 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంలో భాగంగా ముస్లింలతో సమావేశమయ్యారు. అప్పుడు వైఎస్ రాజశేఖరరెడ్డి, ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మినహా ముస్లిం మైనార్టీల అభ్యున్నతిపై ఎవరూ ఆలోచించలేదన్నారు. ముస్లిం మైనార్టీ విద్యార్థులకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి, విద్య, ఉద్యోగాల్లో ఉన్నత చదువులకు అవకాశం కల్పించారన్నారు. ఇప్పుడు వైఎస్ జగన్ కూడా ముస్లింల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్ నుంచి ముస్లిం మైనార్టీలను దూరం చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన పార్టీ నేతలు చేస్తున్న కుట్రలు చేయడం సరికాదన్నారు. కార్పొరేటర్ రహంతుల్లా, కోఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, పార్టీ నాయకులు ఖాజా, ఖాదర్ వలి, ఫకృద్దీన్, ఆసిఫ్, బాబా, నజీర్ పాల్గొన్నారు.

పంటల బీమా, పరిహారం అందించాలి

అనంతపురం అర్బన్: గత ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం పంటల బీమా, నష్ట పరిహారం చెల్లించి ఆదుకునేలా చూడాలని కలెక్టర్ ఎం.గౌతమికి ఏపీ రైతు సంఘం వర్కింగ్ అధ్యక్షుడు సి.మల్లికార్జున ఇతర నాయకులు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో కలెక్టర్‌ను నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా వేరుశనగ, పత్తి, ఆముదం, మొక్కజొన్న, వరి పంటలు, చీనీ, దానిమ్మ, బొప్పాయి, అరటి, తదితర ఉద్యాన పంటలు, కాయగూరుల దెబ్బతిన్నాయన్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్‌కు అర్జీ ఇచ్చేందుకు ర్యాలీగా వస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీ సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలను పీఏసీఎస్‌లలో విలీనం చేయాలనే ఆలోచన ప్రభుత్వం విరమించాలన్నారు. జీవో 36, జీవో 90 ప్రకారం వేతనాలను, ఇతర బెనిఫిట్లను అమలు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. అనంతరం స్పందనలో డీఆర్ఓ గాయత్రిదేవికి నాయకులు వినతిపత్రం అందించారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం

అనంతపురం టవర్‌క్లాక్: కూడేరు మండలం కొర్రకోడుకు చెందిన కృష్ణమూర్తి కుమార్తె వేదిక ఉన్నత చదువుకు కురుబ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. సోమవారం కురుబ సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు ఆధ్వర్యంలో రూ.50 వేలు విద్యార్థిని వేదికకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కురుబ కులస్తుల్లో ఆర్థిక స్తోమత లేక పిల్లలను చదవించలేని వారికి సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వేదికకు తాను రూ.20వేలు, కళ్యాణ మంటపం అధ్యక్షుడు కొనకొండ రాజేష్ రూ.10 వేలు, రిటైర్డు లెక్చరర్ నారాయణ రూ. 10 వేలు, పిడుగు కృష్ణమూర్తి రూ.5 వేలు, రాజగోపాల్ రూ.3 వేలు, రామకృష్ణ రూ.2 వేలు ఆర్థిక సహాయం చేశారన్నారు.

కాఫీ విత్ వార్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్

రాప్తాడురూరల్: విద్యాభివృద్ధి కార్యక్రమాల అమలులో సచివాలయ పరిధిలోని డిజిటల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వలంటీర్లు కీలకంగా పని చేయాల్సి ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ స్పష్టం చేశారు. 'కాఫీ విత్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్' అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా డీఈఓ సాయిరామ్ సోమవారం అనంతపురం నగరంలోని 43,45,46 డివిజన్లలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లతో విద్యా పథకాలపై సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు తమ పరిధిలో విద్యాభివృద్ధి పథకాల అమలు, లబ్ధిదారుల గుర్తింపు చేయాల్సి ఉంటుందన్నారు.

యువకుడి అదృశ్యం


హేమంత్ (ఫైల్)

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: రుద్రంపేటకు చెందిన హేమంత్ అనే యువకుడు తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. నాల్గో పట్టణ ఎస్ఐ గంగాధర్ తెలిపిన మేరకు.. రుద్రంపేటకు చెందిన నరసింహులు కుమారుడు హేమంత్ తల్లిదండ్రులు మందలించారని గత నెల 30న ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుమారుడి ఆచూకీ కోసం తల్లిదండ్రులు గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం యువకుడి తండ్రి నరసింహులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హేమంత్ ఆచూకీ తెలిసిన వాళ్లు సెల్: 9346917088, 9346010581కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

సర్వం.. సద్గురు నామస్మరణం



వేణుగోపాల్ నగర్‌లో... హరహర దేవాలయంలో..


మూడో రోడ్డులో సాయిబాబాకు పూజలు చేస్తున్న దృశ్యం


భక్తులతో కిక్కిరిసిన వేమన టెలిఫోన్ భవనం ఎదురుగా ఉన్న సాయిబాబా ఆలయం

అనంతపురం కల్చరల్: నగరంలోని ప్రధాన బాబా మందిరాలు భక్తులతో సోమవారం కిటకిటలాడాయి. ఆదిమూర్తినగర్ వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా, మూడో రోడ్డు, వేణుగోపాలనగర్, ఐదవరోడ్డు, చెరువుకట్టపై వెలసిన షిర్డీసాయిబాబా మందిరాల్లో బాబా దర్శనానికి భక్తులు బారులుతీరారు. పలు చోట్ల పల్లకీ సేవలు, గ్రామోత్సవాలు, బాబాకు చందన సేవలు నేత్రపర్వంగా సాగాయి. సద్గురువులకు ప్రతీకగా నిలిచి పూజలందుకుంటున్న శారదానగర్ శృంగేరీ శారదా శంకరమఠం, శివబాలయోగి ఆశ్రమం, హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమం, కమలానగర్‌లోని సద్గురు రాజ్యలక్ష్మమ్మ ఆశ్రమం తదితర చోట్ల గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి.


దర్శనానికి బారులుతీరిన భక్తులు

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక ఆదర్శనగర్‌లోని గంగపుత్ర కమ్యూనిటీ హాలులో వ్యాసపౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా జరిపారు. బెస్త సేవాసంఘం అనంతపురం నియోజకవర్గం అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడారు. స్థానిక విద్యుత్‌నగర్ సర్కిల్‌లో వ్యాస మహర్షి విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. చేపల హరి, పుల్లయ్య, రమణ, భాస్కర్, చంద్రబాబు, రామకృష్ణ, శ్రీనివాసులు, గంగప్ప, లక్ష్మీనారాయణ, హరినాథ్, రామాంజనేయులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



చెరువు కట్టపై సాయిబాబా, కూరగాయల అలంకరణలో అమ్మవారు

శాకంబరీదేవిగా పెద్దమ్మ తల్లి

నగరంలోని ఐదోరోడ్డులో కొలువుదీరిన పెద్దమ్మతల్లిని సోమవారం వివిధ రకాల కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలందుకున్నారు. అమ్మవారి అలంకరణకు ఉపయోగించిన కూరగాయలతో వండిన ప్రసాదాన్ని వేలాది మందికి మంగళవారం వితరణ చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుడి వ్రతాలు ..

ఆషాఢ శుద్ధ పౌర్ణమి రాకతో పలు ఆలయాల్లో సామూహిక సత్యదేవుడి వ్రతాలు ఘనంగా జరిగాయి. సోమవారం స్థానిక అశోకనగర్‌లోని హరిహర దేవాలయం, రమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయం, మూడో రోడ్డు, వేణుగోపాలనగర్ తదితర చోట్ల సత్యదేవుడి వ్రతాల్లో భక్తులు పెద్ద ఎత్తున బారులుతీరి వ్రతమాచరించారు. పలు చోట్ల అన్నదాన సేవలు, సత్యదేవుడి ప్రసాద వితరణ చేశారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా సోమవారం గురు పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో సాయంత్రం వెండి రథంలో గ్రామోత్సవం నిర్వహించారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణోత్సవం


సర్వాలంకారభూషితుడైన దేవదేవుడు

అనంతపురం కల్చరల్: నగరంలో ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లా అర్చక సమాఖ్య, వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీరామానుజ శోభాయాత్ర నిర్వహించారు. పుట్టపర్తి, అనంతపురం జిల్లాల వారు సంయుక్తంగా నిర్వహించిన శోభాయాత్రలో రెండు ప్రాంతాల నుంచి అర్చక ప్రతినిధులు శ్రీరామానుజాచార్యుల ఫ్లెక్సీలతో, చిత్రపటాలతో తరలి వచ్చి సంఘీభావం తెలిపారు. అనంతరం మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
4-7-2023

స్టాక్ మార్కెట్లు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	486	65,205
నిఫ్టీ ▲	134	19,323

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,817	▲	29
డోజోన్స్	34,418	▲	11
ఎఫ్‌టీఎస్ఈ 100	7,527	▽	4
డాక్స్	16,081	▽	67
షాంఘై	3,244	▲	42
నికాయ్	33,753	▲	564

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	57,730
బంగారం (22 క్యారట్)	54,980
వెండి (కేజీ)	75,500

జియో భారత్ ఫోన్ @ రూ. 999

రూ. 123 నెలవారీ ప్లాన్‌తో అపరిమిత కాల్స్, 14 జీబీ డేటా



న్యూఢిల్లీ: టెలికం సంస్థ జియో తాజాగా ఇంటర్నెట్ ఆధారిత చౌక 'జియో భారత్' మొబైల్ ఫోన్లను ఆవిష్కరించింది. దీని ధర రూ. 999. నెలవారీ రీచార్జి రూ. 123గా ఉంటుంది. దీనితో అపరిమిత వాయిస్ కాల్స్, 14 జీబీ డేటా లభిస్తుంది. జూలై 7 నుంచి 10 లక్షల పైచిలుకు జియో భారత్ ఫోన్ల ప్రయోగాత్మక ట్రయల్స్ ప్రారంభమవుతాయని జియో ఒక ప్రకటనలో తెలిపింది. ఇతర ఆపరేటర్లు అందిస్తున్న ఫీచర్ ఫోన్ నెలవారీ ప్లాన్లతో పోలిస్తే 30 శాతం చౌకగా, 7 రెట్లు ఎక్కువ డేటాను యూజర్లు పొందవచ్చని పేర్కొంది. 2జీ విముక్త భారత్ లక్ష్య సాధనను వేగవంతం చేసే దిశగా జియో ఈ మొబైల్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 25 కోట్ల పైచిలుకు 2జీ ఫీచర్ ఫోన్లను వాడుతున్నారని అంచనా. ఒకవైపు ప్రపంచం 5జీ విప్లవం ముంగిట నిల్చుండగా.. 25 కోట్ల మంది ఇంకా 2జీ శకంలోనే చిక్కుబడిపోయి ఉన్నారని, ప్రాథమిక ఇంటర్నెట్ ప్రయోజనాలను కూడా పొందడం లేదని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. డిజిటల్ సమాజంలో.. టెక్నాలజీ ప్రయోజనాలు ఏ కొందరికో పరిమితం కాకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జియో భారత్ ఫోన్ మరో ముందడుగని ఆయన పేర్కొన్నారు.

ప్రియం కానున్న టాటా కార్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ధరలను సవరిస్తున్నట్లు ప్రకటించింది. సగటున 0.6 శాతం ధర పెంచుతున్నట్లు సోమవారం వెల్లడించింది. తయారీ వ్యయం పెరగడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్‌తోసహా అన్ని మోడళ్లు, వేరియంట్లకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. కొత్త ధరలు జూలై 17 నుంచి అమలులోకి వస్తాయని టాటా మోటార్స్ తెలిపింది. జూలై 16 వరకు నమోదయ్యే బుకింగ్స్, జూలై 31లోగా జరిగే డెలివరీలకు పాత ధరలు వర్తిస్తాయని వెల్లడించింది

సెన్సెక్స్ @ 65000

- 19,300 పైకి నిఫ్టీ
- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- ఇంధన, ఆర్థిక, మెటల్ షేర్లకు డిమాండ్
- మూడోరోజూ కొత్త రికార్డుల నమోదు



సెన్సెక్స్ మైలురాళ్లు

స్థాయి	అందుకున్న తేది
65,000	జూలై 03 2023
64,000	జూన్ 28 2023
63,000	నవంబర్ 30 2022
62,000	అక్టోబర్ 19 2021
61,000	అక్టోబర్ 14 2021

ముంబై: సానుకూల జాతీయ, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో స్టాక్ సూచీల రికార్డు ర్యాలీ సోమవారమూ కొనసాగింది. అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్ ద్వయం షేర్లు రాణించడం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. దేశీయంగా మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు నమోదు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. సెన్సెక్స్ ఉదయం 117 పాయింట్ల లాభంతో 64,836 వద్ద మొదలైంది. నిఫ్టీ 58 పాయింట్లు పెరిగి 19,247 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. తొలి గంట తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే మిడ్‌సెషన్ సమయంలో యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. ఇంధన, ఆర్థిక, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో అధికంగా కొనుగోళ్లు జరిగాయి. ఇంట్రాడేలో వరుసగా మూడోరోజూ సెన్సెక్స్ 581 పాయింట్లు పెరిగి 65,300 వద్ద, నిఫ్టీ 156 పాయింట్లు బలపడి 19,345 కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేసాయి. చివరికి సెన్సెక్స్ 486 పాయింట్ల లాభంతో 65,205 వద్ద ముగిసింది. ఈ సూచీకిది వరుసగా నాలుగోరోజూ లాభాల ముగింపు. మార్కెట్ ముగిసేసరికి 134 పాయింట్లు బలపడి 19,323 వద్ద స్థిరపడింది. లార్జ్ క్యాప్ షేర్లతో పాటు చిన్న, మధ్య తరహా షేర్లకూ డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.56%, 0.30% చొప్పున లాభపడ్డాయి. జూన్ వాహన విక్రయాలు అంతంత మాత్రంగా ఉండటంతో ఆటో షేర్లు నష్టపోయాయి. ఐటీ, టెక్, విద్యుత్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 81.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ అరశాతానికి పైగా ర్యాలీ చేయడంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ.1.73 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి రూ.2.98 లక్షల కోట్లకు చేరింది. ద్రవ్యోల్బణం దిగిరావడంతో కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్ల సైకిల్‌ను ఆపేయ్యొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి. ఆసియాలో జపాన్ ఇండెక్స్ నికాయ్ 33 ఏళ్ల గరిష్టం(33,753) ముగిసింది.

''మార్కెట్లో కొనసాగుతున్న ర్యాలీతో పలు షేర్ల వాల్యుయేషన్లు భారీగా పెరిగాయి. నిఫ్టీ ఎఫ్‌వై 24 ఆదాయ అంచనాకు 20 రెట్ల అధిక ప్రీమియంతో ట్రేడవుతోంది. ఇది చరిత్రాత్మక సగటు కంటే ఎక్కువ. ప్రస్తుతం నెలకొన్న సానుకూల పరిస్థితులు మార్కెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే వీలుంది. ఏదైన చిన్న ప్రతికూలాంశం అనూహ్య దిద్దుబాటుకు దారి తీయవచ్చు. కావున పెట్టుబడులు పెట్టేటప్పుడు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించాలి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త వీకే విజయ కుమార్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- విలీనం తర్వాత తొలి ట్రేడింగ్ సెషన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్లు సానుకూలంగా స్పందించాయి. ఇంట్రాడేలో హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు వరుసగా 4%, 3% చొప్పున ర్యాలీ చేసి రూ.2,926 వద్ద, రూ.1,758 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకాయి. చివరికి హెచ్‌డీఎఫ్‌సీ షేరు 2% లాభంతో రూ.2,871 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు ఒక శాతం పెరిగి రూ.1,719 వద్ద స్థిరపడింది. మొత్తంగా ఈ రెండు కంపెనీల మార్కెట్ విలువ రూ.14.93 లక్షల కోటక్లు పెరిగింది.
- ఎన్ఎస్ఈలో బ్యాంక్ నిఫ్టీ సూచీ ఏడాది గరిష్టం (45,353) తాకింది. చివరికి ఒకశాతం లాభంతో 45,158 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండెక్స్ సైతం 52 వారాల గరిష్టం(20,398) అందుకొని ఆఖరికి 1% లాభంతో 20,253 వద్ద నిలిచింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం జీవితకాల గరిష్ట స్థాయి వద్ద ముగిశాయి.

మైక్రోచిప్.. రూ.2,460 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంబెడెడ్ కంట్రోల్ సాల్యూషన్స్‌లో ఉన్న యూఎస్ కంపెనీ మైక్రోచిప్ టెక్నాలజీ భారత్‌లో రూ.2,460 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు ప్రకటించింది. కార్యకలాపాల విస్తరణ, ఇంజనీరింగ్ ల్యాబ్స్, నిపుణుల నియామకం, సాంకేతిక కేంద్రాలకు మద్దతు, విద్యా సంస్థలకు ఈ మొత్తాన్ని వెచ్చించనుంది. కాగా, ఇక్కడి కోకాపేట్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న వన్ గోల్డెన్ మైల్ ఆఫీస్ టవర్‌లో 5 అంతస్తులను కంపెనీ కొనుగోలు చేసింది. పరిశోధన, అభివృద్ధి కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చింది. ఈ కేంద్రంలో 1,000 మంది ఉద్యోగులు కూర్చునే వీలుంది. భారత్‌లో కార్యకలాపాలను పెంపొందించడానికి మైక్రోచిప్ ముఖ్యమైన వ్యూహాత్మక నిబద్ధతను ప్రకటించిందని సంస్థ ప్రెసిడెంట్, సీఈవో గణేశ్ మూర్తి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ఇండస్ట్రియల్, డేటా సెంటర్, కంప్యూటింగ్, ఆటోమోటివ్, కంజ్యూమర్ అప్లయాన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ వంటి రంగాలకు మైక్రోచిప్ సేవలు అందిస్తోంది.

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ ప్రారంభం..

తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల లావాదేవీలు



గాంధీనగర్: సింగపూర్ ఎస్‌జీఎక్స్ నిఫ్టీ స్థానంలో ప్రవేశపెట్టిన గిఫ్ట్ నిఫ్టీలో సోమవారం నుంచి ట్రేడింగ్ ప్రారంభమైంది. ఎస్‌జీఎక్స్ నిఫ్టీకి సంబంధించిన 9.4 బిలియన్ డాలర్ల ఓపెన్ ఇంట్రెస్ట్‌ను గిఫ్ట్ నిఫ్టీకి బదలాయించగా.. మొదటి రోజున తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల విలువ చేసే లావాదేవీల పరిమాణం నమోదైంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో గిఫ్ట్ నిఫ్టీ ట్రేడింగ్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు తమ ట్రేడింగ్‌లో కొంత భాగం విదేశాల్లో జరిగేదని, ఇప్పుడిక పూర్తిగా దేశీయంగానే నిర్వహించవచ్చని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ఎండీ ఆశీష్ చౌహాన్, ఎన్ఎస్ఈ ఐఎక్స్ ఎండీ వి. బాలసుబ్రమణియమ్ తెలిపారు.

రెండు సెషన్లలో.. దాదాపు 21 గంటలు..

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్ల మారకంలో జరుగుతుంది. ఉదయం 6.30 గం.ల నుంచి మరుసటి రోజు 2.45 గం.ల వరకు రెండు సెషన్లుగా, దాదాపు 21 గంటల పాటు ఇందులో ట్రేడింగ్ కొనసాగుతుంది. తొలుత గిఫ్ట్ నిఫ్టీ 50, గిఫ్ట్ నిఫ్టీ బ్యాంక్, గిఫ్ట్ నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, గిఫ్ట్ నిఫ్టీ ఐటీ డెరివేటివ్ కాంట్రాక్టులు ఎన్ఎస్ఈ ఐఎక్స్‌లో అందుబాటులో ఉంటాయి. తర్వాత మరిన్ని సూచీలను క్రమంగా అందుబాటులోకి తెస్తారు. సాధారణంగా దేశీ మార్కెట్ల ఓపెనింగ్‌ను అంచనా వేసేందుకు ట్రేడర్లు ఎస్‌జీఎక్స్ నిఫ్టీని పరిగణనలోకి తీసుకుంటారు.

ఐడీఎఫ్‌సీ బ్యాంకులో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఓకే

ముంబై: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాతృ సంస్థ ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనం కానుంది. పూర్తిగా షేర్ల మార్పిడి ద్వారా లావాదేవీని చేపట్టనున్నారు. ఇందుకు రెండు సంస్థల బోర్డులూ ఆమోదించినట్లు ఐడీఎఫ్‌సీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు తాజాగా వెల్లడించాయి. విలీన ప్రతిపాదన ప్రకారం ఐడీఎఫ్‌సీ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 155 ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు షేర్లు జారీ చేయనున్నారు. ప్రధానంగా మౌలిక రంగానికి రుణాలందించే ఐడీఎఫ్‌సీ 1997లో ఆవిర్భవించింది. 2015లో ఐసీఐసీఐ, ఐడీబీఐ తరహాలో బ్యాంకింగ్ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. 2018 డిసెంబర్‌లో క్యాపిటల్ ఫస్ట్‌ను టేకోవర్ చేసింది.

పవన్ హాన్స్ విక్రయం రద్దు

గెలుపొందిన బిడ్డర్ అనర్హత ఎఫెక్ట్



న్యూఢిల్లీ: హెలికాప్టర్ సర్వీసుల పీఎస్‌యూ పవన్ హన్స్ లో వ్యూహాత్మక వాటా విక్రయానికి బ్రేక్ పడింది. బిడ్డింగ్‌లో విజయవంతమైన కన్సార్షియంలోని ఒక కంపెనీపై న్యాయపరమైన వివాదాల రీత్యా అనర్హతవేటు పడటం దీనికి కారణమని దీపమ్ పేర్కొంది. వెరసి పవన్ హాన్స్ ప్రయివేటైజేషన్ ప్రయత్నాలకు మూడోసారి చెక్ పడింది. బిడ్‌ను గెలుపొందిన స్టార్9 మొబిలిటీ ప్రయివేట్ లిమిటెడ్ కన్సార్షియంలోని అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీ ఫండ్ ఎస్‌పీసీపై పెండింగ్ కేసుల నేపథ్యంలో ప్రభుత్వం పవన్ హాన్స్ డిజిన్వెస్ట్‌మెంట్ నిర్ణయాన్ని రద్దు చేసినట్లు దీపమ్ తెలియజేసింది. భాగస్వామ్య కంపెనీ పవన్ హాన్స్‌లో ప్రభుత్వానికి 51 శాతం, ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీకి 49 శాతం చొప్పున వాటా ఉంది.

2018లో షురూ: తొలుత పవన్ హన్స్ లో గల 51 శాతం వాటా విక్రయానికి ప్రభుత్వం 2018లో బిడ్స్‌కు ఆహ్వానం పలికింది. అయితే ఓఎన్‌జీసీ సైతం 49 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధపడటంతో నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. 2019లో తిరిగి కంపెనీలో 100 శాతం వాటా విక్రయానికి బిడ్స్‌ను ఆహ్వానించినప్పటికీ స్పందన లభించకపోవడం గమనార్హం! ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో మూడోసారి పవన్ హన్స్ విక్రయానికి తెరతీసింది. కంపెనీ కొనుగోలుకి ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) బిడ్స్‌ను ఆహ్వానించింది. 2022 ఏప్రిల్‌లో స్టార్9 మొబిలిటీ కన్సార్షియం గరిష్ట బిడ్డర్‌గా నిలిచింది. కన్సార్షియంలో అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీసహా.. బిగ్ చార్టర్ ప్రయివేట్ లిమిటెడ్, మహరాజ ఏవియేషన్ ప్రయివేట్ లిమిటెడ్ సైతం భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1000 మేనేజర్ స్కేల్-2 పోస్టులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో మెయిన్ స్ట్రీమ్ కేటగిరీలో మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2 మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1000
» **అర్హత:** ఏదైనా డిగ్రీ, సీఏఐఐబీ ఉత్తీర్ణులై ఉండాలి. పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో ఆఫీసర్‌గా మూడేళ్ల పని అనుభవం ఉండాలి(లేదా) పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో క్లర్క్‌గా ఆరేళ్ల పని అనుభవంతోపాటు సంబంధిత విభాగంలో ఎంబీఏ/ఎంసీఏ/పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.05.2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు రూ.48,170 నుంచి రూ.69,810 చెల్లిస్తారు.
» **పోస్టింగ్ స్థలం:** దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.07.2023
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:**ఆగస్టు రెండు/మూడో వారం
» **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

ఐబీపీఎస్ 4,045 క్లర్క్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. 2024-25 సంవత్సరానికి సంబంధించి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్(సీఆర్‌పీ)-XIII.. క్లర్క్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:**4,045 క్లర్క్ పోస్టులు
» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీస కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
» **వయసు:** 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష ఉంటుంది. మొదట 100 మార్కులకు ప్రిలిమ్స్, రెండో దశలో 200 మార్కులకు మెయిన్స్ ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి మాత్రమే మెయిన్స్ రాసే అవకాశం ఉంటుంది.
» **ప్రిలిమినరీ పరీక్ష తేది:**2023 ఆగస్టు/సెప్టెంబర్లో
» **మెయిన్స్ పరీక్ష తేది:** అక్టోబర్ 2023లో నిర్వహిస్తారు
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**21.07.2023
» **వెబ్‌సైట్:** www.ibps.in

కేజీబీవీల్లో 1241 కొలువులు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)లు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యూఆర్ఎస్)ల్లో 1241 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పోస్టులకు ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జూన్ 26 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పోస్టుల సంఖ్య, అర్హతలు, ఎంపిక విధానం, పరీక్ష స్వరూపం, ప్రిపరేషన్ తదితర వివరాలు..



పోస్టుల వివరాలు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), పోస్టు గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(పీజీ సీఆర్‌టీ), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ) పోస్టులు; అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్ ఎస్)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ) పోస్టులు భర్తీ చేయనున్నారు.

మొత్తం పోస్టుల సంఖ్య: 1241

- **కేజీబీవీ-పోస్టులు 1218:** స్పెషల్ ఆఫీసర్-38, పీజీ సీఆర్‌టీ(ఇంగ్లిష్)-110, పీజీ సీఆర్‌టీ(మ్యాథమేటిక్స్)-60, పీజీ సీఆర్‌టీ(నర్సింగ్)-160, పీజీ సీఆర్‌టీ(తెలుగు)-104, పీజీ సీఆర్‌టీ(ఉర్దూ)-2, పీజీ సీఆర్‌టీ(బోటనీ)-55, పీజీ సీఆర్‌టీ(కెమిస్ట్రీ)-69, పీజీ సీఆర్‌టీ(సివిక్స్)-55, పీజీ సీఆర్‌టీ(కామర్స్)-70, పీజీ సీఆర్‌టీ(ఎకనామిక్స్)-54, పీజీ సీఆర్‌టీ(ఫిజిక్స్)-56, పీజీ సీఆర్‌టీ(జువాలజీ)-54, సీఆర్‌టీ(బయో సైన్స్)-25, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-52, సీఆర్‌టీ(హిందీ)-37, సీఆర్‌టీ(మ్యాథమెటిక్స్)-45, సీఆర్‌టీ(ఫిజికల్ సైన్స్)-42, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-26, సీఆర్‌టీ(తెలుగు)-27, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్-77.
- **యూఆర్ఎస్-మొత్తం పోస్టులు-23:** స్పెషల్ ఆఫీసర్-4, సీఆర్‌టీ(తెలుగు)-5, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-5, సీఆర్‌టీ(సైన్స్)-6, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-3

విద్యార్హతలు

- **పీజీసీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ తోపాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి.
- **స్పెషల్ ఆఫీసర్:** కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణత సాధించాలి.
- **సీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్/పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేయాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణతఉండాలి.
- **పీఈటీ:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సర్టిఫికెట్/డిప్లొమా ఉండాలి. లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు కనీసం ఏడాది వ్యవధి ఉన్న బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ)లో ఉత్తీర్ణత సాధించాలి.
- కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్, సీఆర్‌టీ, పీఈటీ, పీజీసీఆర్‌టీ పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దివ్యాంగులు అనర్హులు.

వయసు

2023 జూలై 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

రాత పరీక్షలో అర్హులైన అభ్యర్థుల ప్రతిభ, టెట్ స్కోరు, అనుభవం ఆధారంగా తుది ఎంపిక చేస్తారు. అన్ని పోస్టులకు రాత పరీక్షలో అర్హత సాధించాలంటే.. ఓసీ అభ్యర్థులు 40 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి. పీఈటీ పోస్టులకు రాతపరీక్షలో మార్కుల(100 శాతం వెయిటేజీ) ఆధారంగా ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష స్వరూపం


- **పీజీసీఆర్‌టీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **స్పెషల్ ఆఫీసర్:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, స్కూల్ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **సీఆర్‌టీ:** ఇందులో కూడా మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **పీఈటీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, జనరల్ ఇంగ్లిష్‌తోపాటు ఫిజియాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, శిక్షణ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** జూలై 5, 2023
- **రాత పరీక్ష తేది:** జూలై 2023
- **వెబ్‌సైట్:** https://schooledu.telangana.gov.in

ఐఐటీల్లో కొత్త కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లు ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా విద్యార్థుల కోసం పలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఐఐటీ గాంధీనగర్ బీటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును రూపొందించింది. ఐఐటీ-ఇండోర్, ఐఐటీ-పాట్నాలో బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, ఐఐటీ బాంబేలో డ్యూయల్ డిగ్రీ ఇన్ క్వాంటం టెక్నాలజీ తదితర కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలకు తగిన కోర్సు ఎంచుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఆయా కోర్సుల తీరుతెన్నులు, ప్రవేశం విధానం, కెరీర్ అవకాశాలు తదితర వివరాలు..



ఐఐటీ ఇండోర్

ఈ ఏడాది ఐఐటీ ఇండోర్ ఎక్కువ సంఖ్యలో కొత్త కోర్సులను ప్రారంభించింది. బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, బీటెక్ ఇన్ మ్యాథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్, బీటెక్ ఇన్ స్పేస్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టింది. 2023-24 విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ ఇండోర్ ఈ కోర్సులలో ప్రవేశాలను ప్రారంభించనుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ఐఐటీ పాట్నా

ఐఐటీ పాట్నా ఈ సంవత్సరం ఇంజనీరింగ్ ఫిజిక్స్‌లో కొత్తగా బీటెక్‌ను ప్రారంభించింది. ఫిజిక్స్‌లో ధ్వని శిక్షణ, విద్యార్థులకు సరికొత్త టెక్నాలజీలను పరిచయం చేయడం ఈ కోర్సు ప్రధాన ఉద్దేశం. సమకాలీన ఫిజిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ను మిళితం చేసి విద్యార్థులను సైన్స్, టెక్నాలజీ రెండింటిలో సమాన సామర్థ్యాలుండే నిపుణులుగా తీర్చిదిద్దడమే ఈ కోర్సు లక్ష్యం.

ఐఐటీ బాంబే

ఐఐటీ బాంబే క్వాంటమ్ టెక్నాలజీలో ఇంటర్ డిసిప్లినరీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఐడీడీపీ)ను త్వరలో ప్రారంభించనుంది. ఈ కోర్సును సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ క్వాంటం ఇన్ఫర్మేషన్ కంప్యూటింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(క్యూయూఐసీఎస్‌టీ) ఆఫర్ చేస్తోంది. ఐఐటీ బాంబేలో ఏదైనా బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ(బీటెక్) కోర్సులో చేరిన విద్యార్థులు ఐఐడీడీపీ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకోవచ్చు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ నిర్మాణం ఇంకా ఖరారు కానప్పటికీ.. రెండేళ్ల కాలవ్యవధి ఉన్న ఈ కోర్సులో క్వాంటం టెక్నాలజీతోపాటు క్యూయూఐసీఎస్‌టీకి అనుబంధంగా ఉన్న పరిశోధనా బృందంతో చేపట్టే ప్రాజెక్ట్ వర్క్‌కు ప్రాధాన్యతనివ్వనున్నారు. ఇతర డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ల మాదిరిగానే ఈ కొత్త కోర్సులో చేరిన విద్యార్థులు ఐదేళ్ల వ్యవధిలో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీని పూర్తిచేస్తారు. బీటెక్ విద్యార్థులు సంబంధిత కోర్సు మూడవ సంవత్సరంలో ఈ ప్రోగ్రామ్‌ను ఎంచుకోవచ్చు.

ఐఐటీ జోధ్‌పూర్

ఐఐటీ జోధ్‌పూర్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్.. కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఫిజిక్స్ విత్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. బేసిక్ సైన్స్, అత్యాధునిక సాంకేతికతలపై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఈ కోర్సును తీసుకువచ్చారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణమైన స్పెషలైజేషన్ల ద్వారా వివిధ కెరీర్ మార్గాలను అందించడం ఈ కోర్సు లక్ష్యం. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోరు ఆధారంగా ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. నాలుగేళ్ల ఈ ప్రోగ్రామ్‌ను ఎనిమిది సెమిస్టర్‌లుగా విభజించారు.

ఐఐటీ హైదరాబాద్

ఐఐటీ, హైదరాబాద్.. బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్‌లో పరిశ్రమ ఆధారిత బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కోర్సును అభ్యసించే విద్యార్థులు బయోలాజికల్ డేటాను అర్థం చేసుకోవడానికి అవసరమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్‌లోనూ శిక్షణ పొందుతారు. ఇది ఎనిమిది సెమిస్టర్లు, నాలుగేళ్ల కాలవ్యవధి ఉన్న ఫుల్‌టైమ్ కోర్సు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకింగ్స్ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు.

ఐఐటీ గాంధీనగర్

ఐఐటీ, గాంధీనగర్.. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును ప్రవేశపెట్టింది. దీనిలోని కొన్ని సబ్జెక్టులు బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లోని సబ్జెక్టులతో ఉమ్మడిగా ఉన్నప్పటికీ.. చాలా సబ్జెక్టులు భిన్నంగా ఉన్నాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సును ఎంచుకోవచ్చు. ఏఐ,మెషిన్ లెర్నింగ్ లో విద్యార్థులు పట్టుసాధించేలా కరిక్యులాన్ని రూపొందించారు. అంతేకాకుండా ఎలక్టివ్స్ సౌకర్యం ఉండటంతో విద్యార్థులు ఏఐకు చెందిన వివిధ విభాగాలు, కంప్యూటర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ తదితర అడ్వాన్స్‌డ్ ఏఐ అంశాలను ప్రత్యేకంగా ఎంచుకోవచ్చు.

ఈ కోర్సు పూర్తి చేయడం ద్వారా విద్యార్థులు పరిశ్రమలో అప్లయిడ్ ఏఐలో అద్భుత కెరీర్ సొంతం చేసుకోవచ్చు. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును నాలుగేళ్లు, ఎనిమిది సెమిస్టర్‌లుగా పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా దీనిలో ప్రవేశం కల్పిస్తారు. ఐఐటీ పాట్నా, ఐఐటీ గువాహటిలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.